క్లుప్తంగా

రేపల్లె పాలిటెక్నిక్ కళాశాలకు కౌన్సెలింగ్ సెంటర్



రేపల్లె: రేపల్లె పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషితో కళాశాలకు కౌన్సెలింగ్ సెంటర్ వచ్చిందన్నారు. తీరప్రాంత విద్యార్థులు కౌన్సెలింగ్ కొరకు గతంలో గుంటూరు, బాపట్ల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. రేపల్లె కళాశాలకు అన్ని హంగులతో సొంత భవనం ఏర్పడటంతో పాటు, కౌన్సెలింగ్ సెంటరు రావటం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రేపల్లె కళాశాలలో ఎస్ఈసీ, సివిల్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 20వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మండల వ్యవసాయ అధికారిగా విజయరాజు



నిజాంపట్నం: మండల వ్యవసాయ శాఖ అధికారిగా చుక్కా విజయరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై నిజాంపట్నం విచ్చేశారు. ఇక్కడ వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న శారద బాపట్లకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పంటలు అత్యధిక దిగుబడి సాధించేలా సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు అందేలా పనిచేస్తానని చెప్పారు.

అంగన్‌వాడీలకు వంట సామగ్రి అందజేత



రేపల్లె: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించటంతో పాటు నాణ్యత విలువలు పాటిస్తూ ఆహారాన్ని అందించాలని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం వంట సామగ్రిని అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సెక్టారు పరిధిలోని 122 అంగన్‌వాడీ సెంటర్‌లకు వంట సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



నిజాంపట్నం: ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని మండల విద్యా శాఖ అధికారి శేషుగోపాల్ అన్నారు. మండలంలోని నిజాంపట్నం ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, బ్యాగ్, షూలను ఉచితంగా అందిస్తోందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జీ రజని, హెచ్ఎం చుక్కా బాపయ్య, ఉపాధ్యాయులు ఆరీఫున్నీసా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం



రేపల్లె: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం వాటిల్లి బేకరీ దగ్ధమైన ఘటన పట్టణంలోని మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు వివరాల మేరకు రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ సాయి బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. మంటలు బేకరీ దుకాణమంత వ్యాపించి దుకాణంలోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో తమ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

- కాలువలను తలపిస్తున్న అంతర్గత రోడ్లు
- రోజుల తరబడి నిలిచి ఉంటున్న వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు, కూటమి సర్కార్

చినుకు పడితే.. కునుకు కరువే



కాలువను తలపిస్తున్న పిన్నిబోయినవారిపాలెం అంతర్గత రోడ్డు



కాలువను తలపిస్తున్న ముత్తాయపాలెంలోని హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు

బాపట్లలో చిన్నపాటి వర్షం పడినా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు కరువై రాత్రంతా జాగారం చేయాల్సి వస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై మోకాలు లోతు నీళ్లు నిలిచాయి. దీంతో దోమల ఉధృతి పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగా ఉండటంతో ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కనీసం డ్రైనేజి సౌకర్యం కూడా లేకపోవడంతో వర్షపు నీరు రోజుల తరబడి రోడ్లపైనే నిలుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి రావడంతోనే రోడ్ల నిర్మాణం చేపడతామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత, ప్రధాన రహదారులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా చెరువులు, కాలువలను తలపిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– బాపట్లటౌన్



వర్షపునీరు నిలిచిన ముత్తాయపాలెం అంతర్గత రోడ్డు



చెరువును తలపిస్తున్న సమ్మెటవారిపాలెం అంతర్గత రోడ్డు

వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

మండల వ్యవసాయ అధికారి మహేష్‌బాబు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మహేష్‌బాబు

రేపల్లె: రైతులకు నిరంతరం వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ సాగులో తోడ్పాటు నందించాలని మండల వ్యవసాయ శాఖాధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమూరు, రేపల్లెలలోని రైతు సేవా కేంద్రాలలో రైతులు, వ్యవసాయ అధికారులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాగులో రైతులకు కలిగే సందేహాలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేయాలన్నారు. రైతులు నిరంతరం వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటూ సాగులో అమలు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచబడునని, అదే విధంగా కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా అంశాలపై రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునే పద్ధతులను, మెళకువలపై అవగాహన కల్పించబడునన్నారు. ఈ నెల 18వ తేదీలోపు అన్నదాత సుఖీభవ పథకంకు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వరమ్మ, వ్యవసాయ విస్తరణాధికారులు కె.సుమంత్, నవీన్, గ్రామ వ్యవసాయ సహాయకులు నిఖేష్, పీఆర్పీ విజయ్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్, ఎంపీఈవోలు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదలవాడలో 'పొలం పిలుస్తోంది'

చదలవాడ(వేమూరు): రైతులందరు ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలని బాపట్ల జిల్లా రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి గల్లా ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు రసాయన ఎరువులపై ఆధార పడకుండా సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపట్టాలన్నారు. రైతులు భూ సార పరీక్షలను అనుసరించి ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వాకా విజయ్, రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి

అమర్తలూరు(వేమూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కోసం రైతులు గ్రామ సచివాలయంలో ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. రైతులు ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి భూమిలో కలియదున్నటం వలన సేంద్రియ కర్బనం పెరిగి భూమి గుల్లబారి తద్వారా అధిక దిగుబడులు సాధించడం జరుగుతుందన్నారు. రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు బి.మణికంఠ, డి.మాధవి, వ్యవసాయ సహాయకులు టి.సాయిదుర్గ, కె.ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

అద్దేపల్లిలో 'పొలం పిలుస్తోంది'

భట్టిప్రోలు(వేమూరు): రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేయాలని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి తెలిపారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని అద్దేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల భూసారం పెరిగి, భూమిలో నత్రజని లభ్యతను పెంచుతుందని అందువల్ల రైతులందరు పచ్చిరొట్ట వేయాలని సూచించారు. పచ్చిరొట్ట వల్ల రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని, భూమిలో లభ్యమయ్యే పోషకాలు పంటకు సులువుగా అందేలా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రజిని, మండల వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



అద్దేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి



పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఎం.హేమంత్ భరత్



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్

ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలి: ఏవో



మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ చెప్పారు. ఏట్రవారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన మేలైన ఎంటీయూ 1262, 1232, 1218 బీపీటీ 2782 రకాల వరి వంగడాలను సాగు చేయవచ్చునని చెప్పారు. రైతులకు సబ్సిడీలో అందించేందుకు బీపీటీ 5204 వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయని కావలసిన రైతులు తీసుకోవాలని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా పైర్లకు ఎరువులు వాడాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని చెప్పారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఉంటేనే సున్నా వడ్డీ రుణాలు, పంటల బీమా పథకం, పంట నష్ట పరిహారం పథకాలతో పాటు కనీస మద్దతు ధర పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మురళి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజశ్రీ, వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలను ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలి

సీడీపీవో లక్ష్మీదేవి

చుండూరు(వేమూరు): అంగన్‌వాడీ పిల్లలను ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని అమర్తలూరు ప్రాజెక్ట్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలు పిల్లలకు అందుతాయని చెప్పారు. అంగన్‌వాడీ పిల్లలను తల్లులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుద్రపాటి శోభారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకుతల, అంగన్‌వాడీ వర్కర్ సుభాషణి, సునీత, పద్మావతి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఉత్తమమైన విద్యా బోధనతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఎంఈవో నిరంజన్



బాపట్ల: ఉత్తమమైన విద్యా బోధనతో విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎంఈవో నిరంజన్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ సమీపంలో మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్‌లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఈ ఏడాది ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం



అమర్తలూరు(వేమూరు): పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అంగన్‌వాడీ కేంద్రంలో లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పీపీ-1, పీపీ-2 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, అంగన్‌వాడీ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

సమాజ్‌వాదీ పార్టీ నాయకులు



బాపట్ల: బాపట్ల మున్సిపాలిటీలో అన్యాక్రాంతమైన చెరువు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్‌ను సమాజ్‌వాదీ పార్టీ నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. సర్వే నెంబరు 339-2 భూమినిలో 4.3 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని నాయకులు గుదే రాజారావు డీఆర్వోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించి సర్వే నిర్వహించి అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జోసెఫ్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



మాతిపాలెంలో ఉపాధి కూలీలతో కలిసి పనులు చేస్తున్న వరికూటి

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ పనులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని మాతిపాలెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల వద్దకు ఆయన వెళ్లారు. కూలీలతో కలిసి పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్‌సీపీ గ్రామాల్లో ఉపాధి పథకం పనులు కల్పించడం లేదన్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని మాతిపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎక్కువగా ఉండటం వల్ల ఉపాధి పథకం పనులు కల్పించడం లేదని తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని, ఉపాధి పథకం అధికారులతో మాట్లాడి కూలీలకు పని కల్పించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించకపోతే తన దృష్టికి తీసుకురావలెనాని ఆయన తెలిపారు. అధికారులతో మాట్లాడి ఉపాధి పథకం పనులు కల్పించడం జరుగుతుందని ఆయన సూచించారు. అదే విధంగా ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలని, 100 రోజులు పని కల్పించకపోతే ఆందోళన చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల అకౌంట్‌లో జమ కాకపోతే గ్రామ స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకుంటున్న యువత సమస్యలు ఉంటే గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తీసుకొని వెళ్లాలన్నారు. ఏ సమస్యలు ఉన్నా గ్రామ స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులకు దృష్టికి తీసుకొని వెళ్లడం జరుగుతుందని, మండల స్థాయి నాయకులు తన దృష్టికి తీసుకొని రావడం జరుగుతుందని ఆయన చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండపల్లి కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు హిమచంద్ర శ్రీనివాస్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇమామ్ హుస్సేన్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతర్లంక సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సీడీపీవో అనసూయకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నిజాంపట్నం: అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ పల్లపట్ల ప్రాజెక్ట్ కమిటీ నాయకులు మంగళవారం పల్లపట్ల సీడీపీవో అనసూయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరిమణి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ పథకాల నుంచి దూరం చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ పాలక ప్రభుత్వాలు అంగన్‌వాడీలను అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నాయన్నారు. కేవలం జీతభత్యాల చెల్లింపుల్లో కార్మికులుగా చూస్తూ అరకొర జీతాలతో సరిపెడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయని పక్షంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉష, బేబీ రాణి, గాయత్రి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు



వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భట్టిప్రోలు(వేమూరు): మాజీ రాజ్యసభ సభ్యుడు కామ్రేడ్ మోటూరు హనుమంతరావు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా మోటూరు హనుమంతరావు గెలుపొందారన్నారు. విద్యార్థులకు భారత రాజ్యాంగం విశిష్టత, ప్రజాస్వామ్యం విలువలు తెలియజేయాలన్న ఉద్దేశంతో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. క్విజ్ మాస్టర్‌గా గుర్రం మురళీమోహన్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు 18వ తేదీ మోటూరు హనుమంతరావు వర్ధంతి రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



ప్రతిజ్ఞ చేస్తున్న సుబ్బరాయణం, విద్యార్థులు

తెనాలిఅర్బన్: దోమల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మారీసుపేట, లక్ష్మీనగర్ కాలనీలో మంగళవారం దోమల నియంత్రణ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు అవాసాలని తెలిపారు. నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటాయని వివరించారు. ఇవి కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. 2027 నాటికి భారతదేశంలో మలేరియాను పూర్తిగా నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ఎస్‌సీఆర్ స్కూల్‌లోని విద్యార్థులకు దోమల నియంత్రణ చర్యలు తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ కరిముల్లా, ఎన్‌సీసీ అధికారి పులి భాస్కరరావు, ఉపాధ్యాయులు బత్తుల శ్రీనివాసారావు, సబ్ యూనిట్ అధికారులు వంగాల పున్నారెడ్డి, శ్రీకంత ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, దాసరి నాగమల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామప్రసాద్, షేక్ రషీద్, షేక్ నవీద్, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

దుగ్గిరాల: మంగళగిరి–తెనాలి మెయిన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ సంఘటన మంగళవారం తుమ్మపూడి దగ్గర చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. బస్సు డ్రైవరు చాకచక్యంగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఘటనా స్థలంలో ట్రాఫిక్ భారీగా ఆగిపోవడంతో దుగ్గిరాల ఎస్సై ఎస్.వెంకట రవి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.